క్లుప్తంగా

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

దంతాలపల్లి: మండలకేంద్రంలోని సూర్యాపేట ప్రధాన రహదారిపై ప్రమాదకంగా గుంత అనే కథనం ఆదివారం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన స్థానిక ఎస్సై పిల్లల రాజు తన సొంత ఖర్చులతో సోమవారం గుంతను సీసీతో పూడ్చించారు.

అభివృద్ధి పనులకు ఎంపీ హామీ

గూడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎంపీ పోరిక బలరాంనాయక్ పలు అభివృద్ధి పనులకు హామీ ఇచ్చారని, త్వరలో ప్రారంభం అవుతాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు

కొత్తగూడ: కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తూ రైతులను బీఆర్‌ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు చల్ల నారాయణరెడ్డి, మొగిళి, రూప్‌సింగ్, వెంకటేశ్వర్‌రావు, బిట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

నెహ్రూసెంటర్: రైతులకు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకుల రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో మధార్, సామ పాపయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, పెరుగు కుమార్, గునిగంటి రాజన్న, అల్వాల వీరన్న, చొప్పరి శేఖర్, శ్రావణ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో బయ్యారం మండలం మొట్లగూడెం ప్రభుత్వ పాఠశాలకు డైస్ కోడ్ ఇవ్వాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాం అందడం లేదని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్, సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, బానోత్ సాయికుమార్, బానోత్ ప్రకాశ్ పాల్గొన్నారు.


తెలంగాణ ఉద్యమకారుడి మృతి



హనుమంతు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హనుమంతు గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందారు. హనుమంతు మృతికి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ జోలి సత్యనారాయణ, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, మార్నేని వెంకన్న, రఘు, ఎండీ.ఫరీద్, బోయినపల్లి లక్ష్మణ్ రావు, శంతన్ రామరాజు, తదితరులు నివాళులర్పించారు.

ప్రింటర్ బహూకరణ



చిన్నగూడూరు: మండలంలోని ఎంపీపీఎస్ గుండంరాజుపల్లి పాఠశాలలో చదువుతున్న తీక్ష మౌర్య పుట్టిన రోజును పురస్కరించుకుని తన తండ్రి పులి కృష్ణ సుమారు రూ.15వేల ఖరీదు చేసే ప్రింటర్‌ను సోమవారం పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వీరస్వామి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేష్, వీరేందర్, రాంబాబు పాల్గొన్నారు.

నిబంధనలు తొలగించాలి

మహబూబాబాద్ అర్బన్: పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం అనివార్యమైన నిబంధనలను తొలగించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోలీడర్ బి. అజయ్‌సారథిరెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

- గత ఏడాది భారీ వర్షాలకు నేలమట్టమైన వైకుంఠధామం
- మరమ్మతులకు నోచుకోని ఉల్లెపల్లి శ్మశానవాటిక
- ఖాళీ స్థలాల్లో దహన సంస్కారాలు



శ్మశానవాటికలో కూలిన దిమ్మె



నిరుపయోగంగా ఉన్న శ్మశానవాటికలోని గది

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామస్తులకు చివరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని ఆకేరు వాగు ఒడ్డున నిర్మించి వైకుంఠధామం గత ఏడాది జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగి వైకుంఠధామం నేలమట్టమైంది. లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన శ్మశాన వాటిక వరద దాటికి ధ్వంసమైంది. మృత దేహాలను కాల్చే దిమ్మె పూర్తిగా కూలిపోయింది. దుస్తులు మార్చుకునేందుకు నిర్మించి గదుల చుట్టు మట్టి కొట్టుకుపోయింది. దీంతో శ్మశానవాటిక అంతా రాళ్లు దిబ్బెల మారింది. గ్రామంలో ఎవరైన మృతి చెందితే ఎక్కడ దహన సంస్కారాలు చేయాలో తెలియక గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు.

ఖాళీ ప్రదేశాల్లో ఖననం

గ్రామానికి సుదూర ప్రాంతంలో ఉన్న ఖాళీ ప్రదేశాలు, పొలం గట్లు, చెరువు శిఖాలను ఆశ్రయించి అక్కడ మృతదేహాలకు ఖననం చేస్తున్నారు. మరికొందరైతే తమ వ్యవసాయ క్షేత్రాల్లో వెళ్లి దహన సంస్కారాలు చేసుకోగా, అసలే స్థలం లేని కుటుంబాలు మాత్రం అవస్థలు ఎదుర్కోవాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది. లక్షల రూపాయలు వెచ్చించి ఏటి ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం పట్టుమని పదేళ్లు కూడా లేదన్నారు. శ్మశానవాటిక కూలిపోయి ఏడాది దాటిన సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కూలిన శ్మశాన వాటికను పునరుద్ధరించి చివరి మజిలీకి తిప్పలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పునరుద్ధరించాలి



గత ఏడాది వరదలకు గ్రామంలోని శ్మశానవాటిక కూలిపోవడంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నాం. చేసేది లేక దూరంగా ఉన్న చెరువు శిఖాన్ని ఆశ్రయిస్తున్నాం. అధికారులు స్పందించి ధ్వంసమైన శ్మశానవాటికను పునరుద్ధరించాలి

– ఉల్లోజు పుట్లయ్య, ఉల్లెపల్లి

మా హయాంలోనే అభివృద్ధికి నిధులు

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కేసముద్రం: 'కేసముద్రం మండల అభివృద్ధికి రూ.300కోట్ల నిధులు మా ప్రభుత్వ హయాంలో నేనే తీసుకువచ్చానని, ఇప్పుడు ఆ నిధులు తామే తెచ్చామంటూ ఇటీవల ఇక్కడికి వచ్చిన మంత్రులు శంకుస్థాపనలు చేశారంటూ' మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ విమర్శించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాన రాష్ట్రం వచ్చిందని, ఆయన పోరాడకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవారా అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి, పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి.నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నీలం దుర్గేష్, రావుల శ్రీనాథ్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరునాయక్, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు భారంగా పనిగంటల పెంపు



మాట్లాడుతున్న రామయ్య

నెహ్రూసెంటర్: కార్మికుల శ్రమ దోపిడీ ఒకవైపు పనిగంటల పెంపు మరోవైపు కార్మికులకు భారంగా మారుతుందని, పని గంటల పెంపు ప్రజాపాలనలో భాగమేనా అని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామయ్య ప్రశ్నించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కొత్తపల్లి రవి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. ప్రజాపాలన పేర కార్మికులు, ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పనిగంటల పెంపును విరమించుకోవాలని జూలై 31న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, సంపత్, పుల్లయ్య, వెంకన్న, రాంలాల్, రవికుమార్ పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న హరినాయక్

మహబూబాబాద్ అర్బన్: సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రెమ్యునరేషన్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ హరినాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో సంఘం నాయకులు సభ్యత్వ నమోదు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడుతూ.. కుటుంబ సర్వే చేసి 8నెలలు గడుస్తున్న అవుతున్నప్పటికీ ఇంత వరకు రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, సరెండర్ బిల్స్, జీపీఎస్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర బిల్లులన్ని క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేకల కుమార్, సభ్యులు మైసయ్య, ప్రసాద్, షబ్బీర్, రాంజా, సాయికుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని ఏటిగడ్డ తండాలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని ఏటిగడ్డ తండాకు చెందిన బానోతు సిజ్జిరాం, వినోద దంపతులకు మధ్య ఈనెల 8వ తేదీన చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన కుమారుడు శివగణేష్ (21) అదే రోజున గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చి అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఇద్దరిపై కేసు నమోదు

డోర్నకల్: ఓ వ్యక్తిపై దాడి చేసిన అమ్మదమ్ములపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 12న మల్లాయికుంటతండాలో తేజావత్ అఖిల్ అనే యువకుడు బెల్టుషాపులో మద్యం తాగుతుండగా కిషన్ గొడవపడి అఖిల్‌పై దాడి చేసి కొట్టినట్లు తెలిపారు. అఖిల్ తన ఇంటికి తన తమ్ముడి తుషాల్‌కు విషయం చెప్పి ఇద్దరు కలిసి కిషన్ ఇంటికి వెళ్లి గడ్డపారతో దాడి చేశారు. కిషన్ తలకు తీవ్ర గాయం కావడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అఖిల్, తుషాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై..

మహబూబాబాద్ రూరల్: ఓ వృద్ధురాలిని ఢీకొట్టిన ఆటో డ్రైవరుపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీలో నివాసం ఉండే పస్తం సమ్మక్క జమాళ్లపల్లి గ్రామ ప్రధాన రహదారిపై నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన పున్నం నాగరాజు ఆటో నడుపుకుంటూ వస్తూ సమ్మక్కను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి సోదరుడు రేబెల్లి జంపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ముగ్గురి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని సాదుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమి విషయంలో రైతు బానోత్ బాబుపై హత్యాయత్నం చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను రిమాండ్ చేశామని కురవి ఎస్సై గంద్రాతి సతీష్ సోమవారం తెలిపారు. బానోత్ బాబు, కుమారుడు భద్రు, కోడలు భూమికను బాబు అన్న పెద్ద కుమారుడు బానోతు హుస్సేన్, కోడలు లక్ష్మి, చిన్న కుమారుడు హతిరామ్ కలిసి రాడ్లు, కర్రలతో గాయపరిచి హత్యాయత్నం చేయబోయారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: భార్య విడిగా ఉండటాన్ని భరించలేక యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన మండలంలోని రెడ్యాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి. దీపిక తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన అల్లి సురేష్ (29)కి వివాహం కాగా ఐదేళ్లుగా భార్య అతడికి దూరంగా ఉంటుంది. ఈక్రమంలో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి అల్లి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్‌బాబు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోఓల్టేజి సమస్యలపై 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనంపై స్పందించిన ఏడీఈ మాట్లాడుతూ.. గత 25వ తేదీ నుంచి పలు మరమ్మతు పనుల కోసం డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. లో ఓల్టేజ్ సమస్య లేదని, మూడు రోజుల్లో విద్యుత్ మరమ్మతులు పూర్తి చేసి డోర్నకల్ సబ్‌స్టేషన్ నుంచి యథావిధిగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏడీఈ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బయ్యారం: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనరంతరం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ రామగిరి భిక్షం, తుడుం వీరభద్రం, రాకేష్, సంగన్న, బుచ్చయ్య, విశ్వనాథం, సుధాకర్, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

బయ్యారం: చివరి మజిలీ కోసం కట్టిన వైకుంఠధామాన్ని దొంగలు వదల్లేదు. వైకుంఠధామం చుట్టూ పెట్టిన ఫెన్సింగ్ వైర్‌తోపాటు సెంట్రింగ్ బాక్స్‌లు, రోటేవేటర్‌ను చోరీ చేసిన ఘటనలో ప్రమేయమున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. గార్ల-బయ్యారం సీఐ రవికుమార్ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గార్ల మండలం సర్వన్‌తండాకు చెందిన గుగులోత్ సాయికిరణ్, బోడ రవి, గుగులోత్ రవితేజ, కురవి మండలం స్టేషన్‌గుండ్రాతిమడుగుకు చెందిన మాలోత్ ప్రేమ్‌కుమార్, భూక్య హుస్సేన్ లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. మండలంలోని లక్ష్మీనర్సింహాపురం సమీపంలో ఉన్న వైకుంఠధామానికి పెట్టిన ఫెన్సింగ్ వైర్, బయ్యారానికి చెందిన వేమన నరేష్ నర్సరీలో దాచిపెట్టిన రూ.70వేల విలువైన సెంట్రింగ్ బాక్స్‌లను ఎత్తుకెళ్లి గూడూరు మండలం కొల్లాపూర్‌కు చెందిన తోట కృష్ణకు విక్రయించారు. ఇదేవిధంగా మహబూబాబాద్‌లోని నర్సంపేట బైపాస్‌రోడ్డులోని పాషా ఆగ్రో ఇండస్ట్రీస్ వద్ద ఉన్న కొత్త రోటోవేటర్‌ను తమ ట్రాక్టర్‌ను తీసుకొచ్చి దొంగిలించారు. దొంగిలించిన రోటోవేటర్‌ను విక్రయించేందుకు వెళ్తుండగా బయ్యారంలో పట్టుకొని విచారించగా నేరాలను ఒప్పుకున్నారు. దీంతో దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులతోపాటు వస్తువులను కొనుగోలు చేసిన కృష్ణను అరెస్ట్ చేసి వారి నుంచి ట్రాక్టర్, రోటోవేటర్, సెంట్రింగ్‌బాక్స్‌లు, ఫెన్సింగ్‌వైరు తీసుకెళ్లిన టాటా ఏసీ, ఐదు సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్టు సీఐ వివరించారు. దొంగతనం చేదించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై తిరుపతితో పాటు సిబ్బంది మోహన్, సారంగపాణి, సురేష్, రమేష్, హరిదాస్, మహేష్‌ను సీఐ అభినందించారు.

దాతల ఔదార్యంతో సబ్‌సెంటర్‌కు సౌకర్యాలు



మాట్లాడుతున్న డాక్టర్ రవిరాథోడ్

డోర్నకల్: దాతల ఔదార్యంతో తొడేల్లగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి సౌకర్యాలు సమకూరాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాథోడ్ తెలిపారు. మండలంలోని తొడేళ్లగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి ఎస్‌కె ఆగ్రోస్ ఎక్స్‌పోర్ట్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ సంస్థ రిఫ్రజేటర్, 10కుర్చీలు, మూడు ర్యాకులు, స్టెక్చర్‌ను విరాళంగా అందించారు. సోమవారం వాటిని ప్రారంభించిన డాక్టర్ రవిరాథోడ్ మాట్లాడుతూ.. ఆరోగ్య మందిరానికి దాతలు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ, డాక్టర్ మేఘన, ఆరోగ్య మందిర భవన దాత తాళ్లూరి కృష్ణారావు, ఆర్‌కె ఆగ్రోస్ పీఆర్వో శివప్రసాద్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న సంఘం నాయకులు

పెద్దవంగర: ఉపాధ్యాయుల పదోన్నతులు స్థానిక సంస్థల ఎన్నికల ముందే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాలనే లక్ష్యంతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ అన్ని జిల్లాల్లో పూర్తి చేసిందన్నారు. విద్యలో నాణ్యత పెంచేందుకు ఖాళీలను భర్తీ చేసి, పదోన్నతులు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య, జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు చిక్కాల సతీష్, వల్లాల శ్రీనివాస్, యుగేంధర్, ఎల్లగౌడ్, మురళి, దయాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీబీ నిర్మూలకు కృషి

డోర్నకల్: టీబీ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ టీబీ రహిత గ్రామాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ తెలిపారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామంలోని ఉప ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇన్‌టెన్సిటీ టీబీ ముక్త్ భారత్ శిబిరాన్ని ప్రారంభించారు.

బీజేపీ నాయకుల విమర్శలు అర్థరహితం

గూడూరు: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, వారి విమర్శలు అర్థరహితమని మండల కాంగ్రెస్ చిట్టి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎడ్ల నరేష్‌రెడ్డి, కొమ్మాలునాయక్, మధుగౌడ్, వీరస్వామి, రసూల్ పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని లక్ష్మిపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భూక్య ప్రభాకర్ రూ.10వేల విలువ చేసే టై బెల్టులు, షూలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు, ఎంఈఓ రామ్‌దాస్, హెచ్‌ఎం చైతన్య పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు యమగాని వెంకన్న అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు అడ్డగింత

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో సోమవారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను తరలించడాన్ని వ్యతిరేకిస్తూ బస్సును గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను గ్రామస్తులు కోరారు.

యూరియా సేల్ సెంటర్ ఏర్పాటు

గంగారం: గంగారం మండలంలోని మర్రిగూడెంలో సొసైటీ ద్వారా యూరియా సేల్ సెంటర్‌ను మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సేల్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సరోజన జగ్గారావు, వేణు, సంపత్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ తహసీల్దార్ రాజేశ్వరావును టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ దళిత రత్న కోండ్ర ఎల్లయ్య మర్యాదపూర్వకం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో దళితులకు అసైన్డ్ భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, నాయకులు సతీష్, ఏపేందర్, సమయ్య, కనకయ్య పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి



బయ్యారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో మునగాల మహేష్‌కుమార్, కృష్ణ, సాయి, పృథ్వీ, పవన్, సాయి, తరుణ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చప్పిడి వెంకటేశ్వర్లు(58) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లికి చెందిన వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

చేతిపంపునకు మరమ్మతులు

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఎస్‌కె జానీ ఆధ్వర్యంలో సోమవారం చేతిపంపునకు మరమ్మతులు చేయించడంతో ఎస్సీ కాలనీ వాసుల దాహార్తి తీరింది.

యూరియా సరఫరా చేయాలి

కొత్తగూడ: ఏజెన్సీ రైతులకు సరిపోను యూరియా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని సరఫరా చేయాలని ములుగు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. పొగుళ్లపల్లి పీఏసీఎస్ వద్ద రైతులతో ఆమె మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో మొక్కజొన్న సాగు ఎక్కువ ఉండటం వల్ల యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అధికారులు రైతుల ఇబ్బందులు గుర్తించి యూరియా కేటాయింపులు పెంచాలని కోరారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

గార్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు స్థానిక రైతువేదిక భవనంలో సోమవారం శిక్షకుడు ప్రవీణ్ శిక్షణ ఇచ్చారు. తొలుత ఈ శిక్షణ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆర్ శారద ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటరుగా సమీపంలోని బీఎల్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

దంతాలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, గౌతంరెడ్డి, కిషోర్, అశోక్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దంతాలపల్లి: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో కలిసి వర్ధంతి సభ వాల్‌పోస్టర్ల సోమవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామన్న, యాకన్న, సుధాకర్, రవి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లికుదురు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు తెలిపారు. మాకే నామ్‌సే ఏక్ లాగావో కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

రైతునేస్తం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: రైతునేస్తం వ్యవసాయ కుటుంబ మాసపత్రిక ఆధ్వర్యంలో రైతునేస్తం పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వర్ రావు సోమవారం తెలిపారు. పురస్కారాలకు దరఖాస్తు చేసుకునే వ్యవసాయ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, అగ్రి ఇన్నోవేషన్స్, రైతునేస్తం వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దానికి వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి ఆగస్టు 31వ తేదీలోగా పంపించాలని సూచించారు. ఎడిటర్, రైతునేస్తం, 62959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ 500004. ఫోన్: 96767 97777 (లేదా) రైతునేస్తం, డోర్ నంబర్ 8198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 522 017, ఫోన్: 97053 83666 చిరునామాలకు పంపాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే అన్నారు. ఈ వార్షికోత్సవం సెప్టెంబర్‌లో ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.